క్లుప్తంగా

నాంచారమ్మకు ప్రత్యేక పూజలు



కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఊరేగింపు భక్తిప్రపత్తులతో కొనసాగుతోంది. అమ్మవారికి ఇంటింటా పూజలు చేసి భక్తులు భక్తి భావం చాటుకుంటున్నారు. ప్రస్తుతం అమ్మవారి గ్రామోత్సవం కుమ్మరిపాలెం గ్రామంలో కొనసాగుతుండగా, భక్తులు చిన్న అమ్మవారిని తమ నివాస గృహాలకు తీసుకువెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. డప్పువాయిద్యాలు, బాణసంచా వెలుగు మధ్య అమ్మవారి ఊరేగింపును రాత్రి వేళ కూడా జరుగుతోంది. ఈ నెల 24,25 తేదీల్లో అమ్మవారి ప్రధాన గుడి జాతర జరగనుండగా, దేవదాయ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఇరిగేషన్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి నూతన కార్యవర్గం



అవనిగడ్డ: దివి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పులిగడ్డ ఇరిగేషన్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడిగా తోట జగన్మోహనరావు, వైస్ ప్రెసిడెంట్‌గా పొనుగుమాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఎం.వెంకట రమేష్‌బాబు, డైరెక్టర్లుగా కొల్లిపర శ్రీనివాసరావు, పెనుమూడి నాగేశ్వరరావు, వీర్నాల నాగేశ్వరరావు, చాపల వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు.

మజ్జిగ పంపిణీ

మోపిదేవి: ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చడానికి తిరుపతి శ్రీనివాసరావు(టీఎస్‌ఆర్) తనయుడు యువ హీరోలు రామ్, హరి ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానానికి వచ్చిన భక్తులు, ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షుడు బోళ్ల పనిబాబు, టీఎస్‌ఆర్ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొడాలి(ఘంటసాల): కొడాలి గ్రామంలో టీఎస్‌ఆర్ గ్రూపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తిరుపతి రామ్, తిరుపతిహరి ఆదివారం ప్రారంభించారు.

పాస్టర్‌కు సత్కారం

ఘంటసాల: పెద్దగూడెంకు చెందిన బాప్టిస్టు చర్చి పాస్టర్ మొండితోక వరప్రసాదరావు ఇటీవల డాక్టరేట్ పొందగా గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. 40 సంవత్సరాలుగా ఘంటసాల మండలంలోని పెద్దగూడెం, ఘంటసాలపాలెం, క్రిస్టియన్‌పేట గ్రామాల్లో సీబీఎం చర్చిలో పాస్టర్‌గా ప్రసాదరావు సేవలందిస్తున్నారు. ఇటీవల సీబీఎం మిషన్ 150 వసంతాల కృతజ్ఞత పండుగా సందర్భంగా సిరంపూర్ యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. గ్రామస్తులు, విశ్వాసులు పాస్టర్ ప్రసాదరావును సన్మానించారు.

ద్వారకానాథ్‌కు డాక్టర్ చంద్రశేఖర్ పరామర్శ



చల్లపల్లి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారకానాథ్‌ను వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ద్వారకానాథ్ స్థానిక అగ్రహారంలోని ఇంటి వద్ద కోలుకుంటూ ఉండగా ఆదివారం సాయంత్రం పరామర్శించారు. ఆయన వెంట సింహాద్రి రామ్‌చరణ్, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, చంద్ర దుర్గాసాగర్, వెనిగళ్ల తారక జగదీష్, నాయకులు ఉన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని భీమేశ్వరస్వామి దేవస్థానం హుండీలో కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం ఆదివారం తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారులు, పాలక మండలి సమక్షంలో ఉదయం 11 గంటలకు భక్తులు స్వామి వారికి సమర్పించుకున్న కానుకలు, మొక్కుబడులను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం

పెనమలూరు: తాడిగడపలోని శ్రీసీతారామ స్వామి దేవస్థానం ఆలయ భూముల టెండర్ కం బహిరంగ కౌలువేలం పాట వేయనున్నామని ఆలయ ఈఓ సుబ్బారెడ్డి తెలిపారు. ఆలయానికి ఆర్‌ఎస్ నంబర్ 106లో 2.81 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో టెండర్ కం బహిరంగ కౌలు వేలం పాట నిర్వహించనున్నామని చెప్పారు.

అభివృద్ధి పథంలో తాళ్లపాలెం

- కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం
- ఆర్‌బీకే, సచివాలయం, హెల్త్‌క్లినిక్‌లు ప్రారంభం
- గ్రామస్తులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు



తాళ్లపాలెంలో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్

కోనేరుసెంటర్:బందరు మండలం తాళ్లపాలెం పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువవుతున్నాయి. కోట్లాది రూపాయలను వెచ్చించి అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. గాంధీజీ కలలు గన్న స్వరాజ్యం దిశగా తాళ్లపాలెంలో మౌలిక వసతులు కల్పిస్తుండటంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గడిచిన నాలుగున్నర ఏళ్ళ పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల కోసం చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలు సాకారం కావటంతో పంచాయతీకి మహర్దశ పట్టింది.

ఓ వైపు అభివృద్ధి మరో వైపు సంక్షేమం...

తాళ్లపాలెం పంచాయతీ ఓ వైపు అభివృద్ధితో పాటు మరో వైపు సంక్షేమ పథకాల అమలుతో దూసుకుపోతోంది. కోట్లాది రూపాయల వ్యయంతో పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామస్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించింది. తాళ్ళపాలెం -1, 2లకు సంబంధించి రూ, 83.60 లక్షల ఖర్చుతో రెండు గ్రామ సచివాలయాలు, రూ. 47.88 లక్షలతో రెండు రైతుభరోసా కేంద్రాలు, మరో రూ. 20.80 లక్షల వ్యయంతో హెల్త్‌క్లినిక్‌లను నిర్మించారు. అలాగే ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.1.52 కోట్లతో 52 సీసీ రోడ్లు నిర్మించారు. మరో రూ. 4.15 కోట్లు బీటీ రోడ్లకు మంజూరు కాగా 13 బీటీ రోడ్లను నిర్మించారు. వీటితో పాటు రూ. 9.88 లక్షల మండల పరిషత్ నిధులుతో ఐదు రోడ్లు వేసి గ్రామానికి వన్నె తెచ్చేలా రహదారులను అభివృద్ధి చేశారు. అలాగే నాడు నేడు కింద గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను సుందరంగా తీర్చిదిద్దారు.



తాళ్లపాలెం-2 సచివాలయం

వేలాది మందికి సంక్షేమ ఫలాలు...

గ్రామంలో వేలాది మందికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారు. 1214 మందికి పింఛన్లు, 632 మందికి అమ్మ ఒడి, 138 మందికి విద్యాదీవెన, 89 మందికి వసతిదీవెన, 46 మందికి వాహనమిత్ర, 440 మందికి చేయూత, 39 మందికి చేదోడు, 1571 మందికి వైఎస్సార్ ఆసరా, 1416 మందికి వైఎస్సార్ సున్నా వడ్డీ, 462 మందికి పంట భీమా, 1082 మంది ఇన్‌పుట్ సబ్సిడీ, 738 మందికి రైతు భరోసా వంటి పథకాలతో వేలాది మందికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని ప్రజాసంక్షేమమే తమ ధ్యేయమని జగన్ సర్కార్ నిరూపించింది.

నాన్ డీబీటీ కింద మరెన్నో పనులు...

ఇదిలా ఉండగా నాన్ డీబీటీ కింద లక్షలు ఖర్చు చేసి గ్రామంలోని నిరుపేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేసింది. జగనన్న విద్యాకానుక కింద ఎంతో మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసింది. జగనన్న తోడు రుణాలు, జగనన్న గోరు ముద్ద, వైఎస్సార్ సంపూర్ణపోషణ, ఇంటింటికి రేషన్ పేరుతో అనేక విధాలా ప్రయోజనాలు చేకూర్చింది. గ్రామంలో మునుపెన్నడూ లేనంతగా సంక్షేమం, అభివృద్ధి పనులు జరగటంతో గ్రామస్తులు ప్రభుత్వం పట్ల, బందరు శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) చొరవను ప్రజలు అభినందిస్తున్నారు. వచ్చేమారు మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కావాలంటూ తమ గళం వినిపిస్తున్నారు.

మెరుగైన వైద్యానికి డాక్టర్ చంద్రశేఖర్ సిఫార్సు



వ్యాధిపీడితుడు మూర్తితో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం పర్యటనలో ఉన్న వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ ఓ క్యాన్సర్ రోగికి మెరుగైన వైద్యానికి సిఫార్సు చేసిన సంఘటన చోటు చేసుకుంది. తెలుగుచర్చిలో ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)తో కలిసి ప్రార్థనలో పాల్గొన్న అనంతరం ఆయనను క్యాన్సర్‌తో బాధపడుతున్న 13వ డివిజన్‌కు చెందిన మాలే మూర్తి తన వ్యాధికి సంబంధించిన రిపోర్ట్ లను చూపారు. దీంతో స్పందించిన డాక్టర్ చంద్రశేఖర్ మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి వైద్యుడు కృష్ణారెడ్డిని కలవాలని ఆయన మెరుగైన వైద్యం, కిమోథెరపీ చేస్తారని సిఫార్సు లేఖ రాసి మూర్తికి ఇచ్చారు.

రాజకీయ నేతల ఫ్లెక్సీల తొలగింపు



అవనిగడ్డలో హోర్డింగ్‌ను తొలగిస్తున్న సిబ్బంది



బందరులో పోస్టర్లు తొలగిస్తున్న సిబ్బంది

కోడూరు: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు ఎన్నికల నియమావళి నిబంధనలు అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని 13 పంచాయతీల పరిధిలోని రాజకీయ నేతల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేశారు. కోడూరు బొమ్మల సెంటర్, వంతెన సెంటర్, మెరకగౌడపాలెం, ఉల్లిపాలెం, పిట్టల్లంక, వి.కొత్తపాలెం గ్రామాల్లో ఉన్న ఎన్టీఆర్, వీఎం రంగాతో పాటు స్థానిక నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు.

ప్రధాన కూడళ్లలో వివిధ రాజకీయ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా తొలగించారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల వద్ద ఉన్న నేతల ఫొటోలను కూడా తొలగించారు. కోడ్ నిబంధనలను అన్ని రాజకీయ పార్టీల నేతలు తప్పనిసరిగా అనుసరించాలని తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు కోరారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని వివిధ రాజకీయ పక్షాల ఫ్లెక్సీలు, ప్రచార హోర్డింగ్‌లను నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది తొలగించారు. సెంట్రల్ డివైడర్‌లో ఉన్న బ్యానర్లు, వాల్‌పోస్టర్లను తొలగించారు.

మోపిదేవి: తహసీల్దార్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రధాన రహదారులు, బహిరంగ ప్రదేశాల్లోని ఫ్లెక్సీలు, బ్యానర్లు ఆదివారం తొలగించారు. పార్టీ నాయకుల విగ్రహాలు, దిమ్మలకు మాస్కులు తొడిగారు.

అవనిగడ్డ: స్థానిక డిగ్రీ కళాశాల ప్రాంతంలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌లను పంచాయతీ సిబ్బంది తొలగించారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బంటుమిల్లి: మండలంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ-1 త్రిపురసుందరీదేవీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బంటుమిల్లిలో 4, అర్తమూరు, చోరంపూడి, పెదతుమ్మిడి గ్రామాల్లో మొత్తం 7 పరీక్ష కేంద్రాలు సిద్ధం చేశామని ఎంఈఓ తెలిపారు. ఈ సెంటర్లలో మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు 12 ఉన్నత పాఠశాలలు, కృత్తివెన్ను మండలం చినపాండ్రాక, ఇంతేరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు మొత్తం 1,039 మంది పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. వివాద కేంద్రంగా ఉన్న పెదతుమ్మిడి పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

కోడూరు: మండంలోని పది పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు ఆదివారం తెలిపారు. కోడూరు మండలంలోని పరీక్షల నిర్వహణకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో ఏడు రూములు, కోడూరు రవితేజ పబ్లిక్ స్కూల్‌లో పది రూముల్లో పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన బల్లలు, సామాగ్రిని సమకూర్చినట్లు ఎంఈఓ వివరించారు. మండలంలోని ఐదు జెడ్పీ పాఠశాలలు, ప్రయివేటు పాఠశాలల నుంచి 352 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఎగ్జామ్ చీఫ్‌లుగా ఉపాధ్యాయులు సుధారాణి, కుమార్ వ్యవహరిస్తారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ శిరీష తెలిపారు.

అవనిగడ్డ: పదో తరగతి పరీక్షలకు అవనిగడ్డలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్‌ఆర్‌వై వికాస్ పాఠశాల, శ్రీచైతన్య హైస్కూల్‌లో మొత్తం 342 మంది పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12.45 గంటలకు ముగుస్తాయని, ఉదయం 8.30 గంటల కల్లా పరీక్ష కేంద్రానికి విద్యార్థులు హాజరుకావాలని ఎంఈవో శివశంకరరావు తెలిపారు.

గూడూరు: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు గూడూరు మండల విద్యాశాఖ అధికారి బీఎస్‌సీ శేఖర్‌సింగ్ తెలిపారు. మండలం నుంచి 399 మంది విద్యార్థులు ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. వీరికోసం గూడూరు, మల్లవోలు, కంకటావ హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

మోపిదేవి: మండలంలో మొత్తం మూడు సెంటర్ల నుంచి రెగ్యులర్ విద్యార్థులు 352 మంది హాజరుకానున్నట్లు విద్యాశాఖ అధికారులు చెప్పారు. మోపిదేవి జెడ్పీపాఠశాల సెంటర్‌లో 191 మంది, గురుకుల పాఠశాలలో 71 మంది, పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాలలో 90 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు.

పాల ఉత్పత్తిదారుడికి గోల్డ్‌కాయిన్

పామర్రు: పామర్రు క్లస్టర్ పరిధిలోని నిభానుపూడి పాల కేంద్రంలోపాలు పోసిన రైతు సీహెచ్ నాగేశ్వరరావు కుమారుడికి కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రవేశ పెట్టిన కల్యాణమస్తు పథకం కింద నాలుగు గ్రాముల బంగారు నాణాన్ని జిల్లా ట్రస్టు బోర్డు డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆదివారం బహూకరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వెన్నా రామకృష్ణ, రూట్ సూపర్‌వైజర్ బాష, పాల కేంద్రం అధ్యక్షుడు, ట్రస్టు బోర్డు జిల్లా సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, పామర్రు క్లస్టర్ మేనేజర్ సీహెచ్ గోపిచంద్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఘంటసాలపాలెం(ఘంటసాల): ఘంటసాలపాలెం, దాలిపర్రు గ్రామ పంచాయతీల కార్యదర్శులుగా బోలెం అర్జునరావు, పి.రాంబాబు శనివారం బాధ్యతలు స్వీకరించినట్లు సిబ్బంది తెలిపారు. ఆయా పంచాయతీల్లో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు లేకపోవడంతో లంకపల్లి పంచాయతీ గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న అర్జునరావును ఘంటసాలపాలెం పంచాయతీకి గ్రేడ్ 1 కార్యదర్శిగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వగా, చల్లపల్లి మండలం పురిటిగడ్డ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న పి.రాంబాబును దాలిపర్రు పంచాయతీ కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు అందాయని రాంబాబు చెప్పారు. ఆయా కార్యదర్శులను సంబంధిత సర్పంచ్‌లు దోనె రజని, డోకిపర్తి శాంత కుమారి, పాలకవర్గ సభ్యులు, అధికారులు, గ్రామస్తులు అభినందించారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి రూ.50 వేలు



చల్లపల్లి: గ్రామంలోని నిమ్మలతోటలో ఉన్న సీయోను వృద్ధాశ్రమ ఆవరణలో నూతన భవనం నిర్మాణానికి చల్లపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) ఆదివారం రూ.50వేలు ఆర్థిక సాయం చేశారు. ఆదివారం ఆశ్రమ ఆవరణలో నిర్వాహకులు శీలం భాస్కరరావుకు అందజేశారు. కార్యక్రమంలో ముమ్మనేని అనీల్ వంశీ, సీతారామరాజు, వేముల హరికృష్ణ, కిషోర్ పాల్గొన్నారు.

సందడిగా పీవీపీ సిద్ధార్థ వార్షికోత్సవం

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి కాలేజీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన తర్వాత ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్‌ఆర్‌ఎం వైస్ చాన్సలర్ మనోజ్ కే అరోరా మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు చదవాలన్నారు. నేడు సాంకేతిక రంగంలో అనేక నూతన మార్పులు వస్తున్నందున అధ్యాపకులు కూడా నాణ్యమైన బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ నాగభూషణరావు, సహాయ కార్యదర్శి లలితప్రసాద్, డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న కార్పొరేటర్ ముంతాజ్‌బేగం

మచిలీపట్నంటౌన్: రంజాన్ సందర్భంగా నగరంలోని పరాసుపేట రజా మసీదు వద్ద పేద ముస్లింలకు నిత్యావసర సరుకులను పదో డివిజన్ కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం ఆదివారం అందజేశారు. ఖతార్‌లో నివసిస్తున్న హాజీ అన్వర్‌బేగ్ సమకూర్చిన రూ.1000 విలువైన నిత్యావసర సరుకుల కిట్లను 70 మంది పేదలకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా పేదలకు దానధర్మాలు చేయడం ఇస్లాంలో ముఖ్య అంశమన్నారు. పేదలకు దానధర్మాలు చేయడంతో అల్లాహ్ అనుగ్రహం, పుణ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇమామ్ గులాం మొహమ్మద్, హఫీజ్ సాహెబ్ తహసీన్ రజా, మసీదు ప్రెసిడెంట్ షా నజీర్, హాజీ యాకూబ్, హాజీ అబ్దుల్‌వహాబ్, హాజీ జఫ్రుల్లాఖాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుచర్చిలో డాక్టర్ చంద్రశేఖర్, పేర్ని కిట్టు ప్రార్థనలు



తెలుగుచర్చి వద్ద పేర్ని కిట్టు, డాక్టర్ చంద్రశేఖర్

మచిలీపట్నంటౌన్: నగరంలోని తెలుగుచర్చిలో ఆదివారం జరిగిన ప్రార్థనలకు వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరి కోసం చర్చి వికార్ జాస్పర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వీరిద్దరితో పాటు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మకు శాలువాలు కప్పి సత్కరించారు. చర్చిలోని క్రైస్తవులను డాక్టర్ చంద్రశేఖరరావు, పేర్ని కిట్టు పలుకరించారు. ప్రార్థనల్లో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ), కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నగర నాయకులు బందెల థామస్‌నోబుల్, గాజుల భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా జగనన్న

జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, వైఎస్సార్ సీపీ పెడన అభ్యర్థి రాము



నిడమర్రు పంచాయతీ ప్రజాదీవెనలో హారిక, రాముకు హారతులిస్తున్న మహిళలు

కృత్తివెన్ను: సంక్షేమానికి చిరునామా సీఎం జగనన్న అని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము అన్నారు. వారు ఆదివారం మండలంలోని నిడమర్రు పంచాయతీలో ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి స్థానిక మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. వారు గ్రామంలోని ప్రతి గృహాన్ని సందర్శించి ప్రభుత్వం నుంచి ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు.

జగన్‌తోనే సంక్షేమ పథకాలు

సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే అన్ని సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, ప్రజలకు మరింత మేలు జరగాలంటే మరోసారి ఆయనే సీఎం కావాలని ఉప్పాల రాము అన్నారు. ఎంతటి కష్టకాలం ఎదురైనా పేదలకు అందించాల్సిన సంక్షేమాన్ని జగనన్న క్రమం తప్పకుండా అందించిన విషయాన్ని మరవకూడదన్నారు. పేదల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధిగా తలచి పాలన సాగించిన పేదప్రజల పక్షపాతి మన జగనన్న అని ఉప్పాల హారిక చెప్పారు. జగనన్న మనకు చేసిన మేలును మరవకుండా ఓటు రూపంలో ఫ్యాను గుర్తుపై ఓటేసి ఆయన్ను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ మహేష్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు, స్థానిక ఎంపీటీసీ తమ్ము పెద్దింట్లమ్మ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బాపూజీ, ఎస్సీసెల్ కన్వీనర్ జాన్‌రత్నం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పెదప్రోలులో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెదప్రోలు(మోపిదేవి): అనారోగ్యంతో ఇటీవల పలుగ్రామాల్లో మృతి చెందిన కుటుంబాలను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం పరామర్శించారు. మండలంలోని పెదప్రోలు శివారు కాసానగర్‌లో గులులోత్ భజన(68) మృతి చెందారు. మృతునికి భార్య మంగమ్మ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నవజీవన్ నగర్‌లో గూడవల్లి సుందరావు(63) మృతి చెందారు. ఆయనకు భార్య ఎస్తేరియా ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అంబేడ్కర్‌నగర్‌లో కత్తుల సుబ్బారావు(65) మృతి చెందారు. ఆయనకు భార్య రత్నకుమారి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కనిగంటి శ్రీనివాసరావు(52) మృతి చెందారు. ఈయనకు భార్య వెంకటేశ్వరమ్మ ఇద్దరు కుమారులు ఉన్నారు. గోవాడ మల్లేశ్వరమ్మ(67) మృతి చెందారు. భర్త రాముడు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, సానుభూతిని వ్యక్తంచేశారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు, ఎస్సీ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, రవికాంత్ యాదవ్, కమలాకర్‌రావు, గద్దం శ్రీనివాసరావు, నాగభూషణం పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పెడనలో పరీక్ష సామగ్రి అందజేస్తున్న నిర్వాహకులు



పరీక్ష సామగ్రితో పెందుర్రు విద్యార్థులు

బంటుమిల్లి: పెందుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం పూర్వ విద్యార్థి పరీక్ష ప్యాడ్, జామెట్రీ బాక్స్ అందజేశారు. పరీక్షల నేపథ్యంలో పాఠశాల పూర్వ విద్యార్థి కాసిన వెంకటేశ్వరరావు విద్యార్థులు అందరికీ ప్యాడ్లు, పెన్నులు, జామెట్రీ బాక్స్‌లు బహూకరించి అభినందించారు. వెంకటేశ్వరరావు విజయవాడలో విద్యా సంస్థ నడుపుతూ స్థిరపడి తాను విద్యనభ్యసించిన పాఠశాలకు చేయూత నివ్వాలని సదుద్దేశంతో ఆరేళ్లుగా విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. హెచ్‌ఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెడన: పట్టణానికి చెందిన సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ అభ్యాసకుల పరీక్షలకు ఉపయోగపడే పరీక్ష సామగ్రిని అందజేశారు. ఆదివారం స్థానిక బీజేకే హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఉపయోగపడే ఎగ్జామ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, ఎరేజర్, షార్పనర్, స్కేలుతో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్ బాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయని కె.లక్ష్మీకోట్నిస్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు, కోఆర్డినేటర్ అద్దంకి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యసాయి వ్రతం



పెనమలూరు: పెనమలూరులో ఆదివారం సత్యసాయి సేవా సమితి 23వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 63 మంది మహిళలు సామూహిక సత్యసాయి వ్రతం చేశారు. సేవాసమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ సత్యసాయి సమితి జిల్లా వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ నాగప్రసాద్, వివిధ ప్రాంతాల కన్వీనర్లు వి.మోహన్‌రావు, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

మా క్లయింట్ కృష్ణాజిల్లా, కృత్తివెన్ను మండలం, మాట్లం గ్రామ కాపురస్తురాలు గాడి వెంకట్రావు గారి భార్య వెంకటేశ్వరమ్మ మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం ఐందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

మా క్లయింటుకు కృష్ణాజిల్లా, కృత్తివెన్ను మండలం, మాట్లం గ్రామంలో 580 చ.గజముల నివేశన స్థలం, అందులో డోర్ నెం. 3-34రు గల ఇల్లు కలదు. ఈ పరిస్థితిలో మా క్లయింటు గ్రామ కాపురస్తులు అయిన ఒడుగు సుబ్బారావు, ఒడుగు బ్రహ్మయ్య, ఒడుగు వరలక్ష్మి, ఒడుగు లక్ష్మి మరియు పొన్నమండ మోహనరావు అనువారలు మా క్లయింటు యొక్క పై స్థలముగుండా రోడ్ వేయుటకు ప్రయత్నం చేయగా మా క్లయింట్ బంటుమిల్లి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో ఓ.ఎస్. నెం. 54/2023రు గల దావా దాఖలు చేసి సదరు దావాలో ఐ.ఏ. నెం. 614/2023 పిటీషన్ ఉత్తర్వుల ప్రకారం తాత్కాలిక ఇంజక్షన్ ఉత్తర్వులను పొందియున్నారు. సదరు ఉత్తర్వులను భంగపరుస్తూ గ్రామంలోని కొంతమంది ప్రజలతో లాలూచి పడి మా క్లయింటు స్థలములోనుండి రోడ్ వేయుటకు ప్రయత్నం చేయుచున్నారని మా క్లయింటుకు తెలియవచ్చినది. సదరు ఉత్తర్వులకు భంగం కలగజేస్తూ పైన పేర్కొన్న ఐదుగురు వ్యక్తులు గానీ, వారికి సహకరించిన వ్యక్తులుగానీ మా క్లయింటు స్థలం గుండా రోడ్ వేయుటకు ప్రయత్నం చేసిన యెడల మా క్లయింటు తీసుకొనే అన్ని సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

షెడ్యూలు: కృష్ణాజిల్లా, కృత్తివెన్ను మండలం, మాట్లం గ్రామం, బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీస్ పరిధిలోని 580 చ.గజముల నివేశన స్థలం, అందులో డోర్ నెం. 3-34 రు గల ఇంటికి హద్దులు : తూర్పు : రోడ్, దక్షిణం : పొన్నమండ యేసుబాబు గారి స్థలం, పడమర : పొన్నమండ నాగరాజు గారి స్థలం, ఉత్తరం : పొన్నమండ సెలబాబుడు గారి స్థలం.

మచిలీపట్నం — జి.వి.ఎల్. నరసింహారావు,
ది. 17-3-2024 — పులి పవన్ కుమార్, న్యాయవాదులు
సెల్ : 98489 38399